ప్రయాణం.. నరకప్రాయం


బైపాస్ రోడ్డు రిలయన్స్ పెట్రోల్‌బంకు సమీపంలో ఇలా..


మున్సిపల్ ఆఫీసు రోడ్డులో ఏర్పడిన గోతులు

హిందూపురం పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లన్నీ కంకర తేలి గుంతలు పడడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. నడవడానికి సైతం వీలుకాని పరిస్థితి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రోడ్లపైనే ప్రయాణిస్తుంటారు. కానీ రోడ్లను బాగుచేసేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే బాలకృష్ణ పట్టణాభివృద్ధి విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- గుంతలమయంగా మున్సిపాలిటీ రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

హిందూపురం: మున్సిపాలిటీ రోడ్లలన్నీ గుంతలమయంగా మారాయి. పట్టణంలో ఎక్కడ చూసినా రోడ్లు గోతులమయంగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికలు గెలిచాం ఇక మాకేం సంబంధం అని ప్రజాప్రతినిధులు, మాకేందుకులే అంటూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

దెబ్బతిన్న రహదారులు

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు హిందూపురం పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ దెబ్బతిన్నాయి. బైపాస్‌రోడ్డు, పట్టుగూళ్ల మార్కెట్ రోడ్డు, రహమత్‌పురం సర్కిల్ వరకూ గుంతలను ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చారు. అయితే మరమ్మతుల్లో నాణ్యత పాటించకపోవడం వల్ల మళ్లీ గోతులు పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. ఏ రోడ్డులో చూసినా మోకాల్లోతు గోతులు ఏర్పడ్డాయి. పలువురు ప్రయాణికులు వాహనాల్లో వెళ్తూ వర్షపు నీటి నిండి ఉన్న గోతుల్లో కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల ముద్దిరెడ్డిపల్లికి చెందిన మహిళ స్కూటీలో వెళ్తూ వర్షపు నీటితోఉన్న చిన్నగోతి అనుకుని అటుగా వెళ్లి.. కిందపడి గాయాలపాలైంది. ఇక రోజూ ఎవరో ఒకరు ఈదారిల్లో పడిపోవడం నిత్యకృతంగా మారింది. రోడ్లు వేయకపోతే కనీసం గుంతలైనా పూడ్చాలంటూ వాహనదారులు అధికారులను కోరుకుంటున్నారు.

ఎమ్మెల్యే బాలయ్య చొరవ చూపేనా?

కూటమి ప్రభుత్వం అధికారులకు రావడంతో ఎమ్మెల్యే బాలకృష్ణ పట్టణాభివృద్ధి విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలప్పుడు కనిపించిన ఎమ్మెల్యే బాలకృష్ణ.. గెలిచిన తర్వాత ఇప్పటి వరకూ నియోజకవర్గం వైపు తిరిగి చూడలేదు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో మరమ్మతులకు గురవుతోంది



ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. పట్టణంలోని దారులు అడుగడుగునా గుంతల మయంగా మారాయి. ఎగుడు దిగుడు గుంతల్లో ప్రయాణించడం వల్ల ఆటో తరచూ మరమ్మతులకు గురవుతోంది. సంపాదించింది అంతా రిపేర్లకే సరిపోతుంది. అధికారుల స్పందించి గుంతలు పూడ్చాలి.

– మహమ్మద్, హిందూపురం

గుంతల రోడ్లలో ప్రయాణం ఇబ్బంది



పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా ఉండటంవల్ల ప్రయాణించడానికి ఇబ్బందిగా ఉంది. చాలామంది వాహనదారులు గుంతల్లో కిందపడి గాయపడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయాలి.

– మూర్తి ఆర్టీసీ కాలనీ, హిందూపురం.

ప్రతిపాదనలు పంపించాం

పట్టణంలోని ప్రధాన రహదారి గురునాథ్ సర్కిల్ నుంచి బెంగళూరు రోడ్డు వేమన విగ్రహం వరకుసుమారు 5.08 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.7.30కోట్లు నిధులతో ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులుప్రారంభించే చర్యలు తీసుకుంటాం. అలాగే పట్టుగూళ్ల మార్కెట్ రోడ్డు నుంచి ఎంజీఎం స్కూల్ వెళ్లే దారి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– మోహన్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ, హిందూపురం

క్లుప్తంగా

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు


అభ్యసన వైకల్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని వక్తలు తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శనివారం డిస్‌లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. డిస్‌లెక్సియా అనేది అభ్యసన వైకల్యమన్నారు. ఇలాంటి వైకల్యంతో బాధపడే వారు పదాల, సంఖ్యల ఉచ్చారణ, అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారన్నారు. అనంతరం డిస్‌లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబా ఫక్రుద్దీన్, మునికుమారి, ఉపాధ్యాయులు విమలమ్మ, సహిత, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు మమత, రేవతి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను రెగ్యులర్ చేయాలి

పెనుకొండ: 1998 డీఎస్సీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఉపాధ్యాయుడు మారుతి రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. 1998 డీఎస్సీ ఉపాధ్యాయులను మినిమం టై స్కేల్ ద్వారా నియమించబడడం జరిగిందన్నారు. ఎలాంటి టీఏ, డీఏ లేకుండా కనీసం పెన్షన్ విధానం అమలు చేయలేదన్నారు. అకస్మాత్తుగా చనిపోయిన ఉపాధ్యాయులకు వారి కుటుంబాలకు ఎలాంటి ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం 98 డీఎస్సీ ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని వారికి అన్ని విధాలుగా న్యాయం చేయాలని కోరారు.

రెసిడెన్షియల్ స్కూల్ తనిఖీ


విద్యార్థినులతో న్యాయమూర్తి వాసుదేవన్

పెనుకొండ: హైకోర్టు ఉత్తర్వుల మేరకు పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను న్యాయసేవా సమితి చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ శనివారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంట గదులు, వసతి గదులు, బాత్రూంలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్లకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే మండల న్యాయసేవా అధికార సమితిలో ఫిర్యాదు చేసినట్లయితే తక్షణమే సహాయక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గోరంట్ల: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవ సమితి అధ్యక్షుడు వాసుదేవన్ సందర్శించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది టీచర్లు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ



సోమందేపల్లి: మండలంలోని సుద్దకుంటపల్లిలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ శుక్రవారం రాత్రి కూలిపోయింది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రహరీ దెబ్బతినడంతో కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యాశాఖ అధికారులు త్వరితగతిన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

ఎగువతండాలో కూలిన ఇల్లు

మడకశిరరూరల్: వర్షాలకు గుర్రుపుకొండ ఎగువ తండాలో రామానాయక్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. ఘటనలో రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పేట వేంకటరమణస్వామి ఆలయంలో పూజలు


ప్రాకారోత్సతవం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేటవేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళ హారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగలి నైవేద్యాన్ని పంపిణీ చేశారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి


వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ: దేశంలో మానవ అక్రమ రవాణా అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సమతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మానవ అక్రమ రవాణా, బానిసత్వాన్ని వ్యతిరేకిస్తూ వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో అనేక ప్రాంతాల్లో మానవ అక్రమ రవాణా జరుగుతోందన్నారు. లైంగిక దోపిడి, బలవంతపు వివాహాలు, బాల్య వివాహాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రపంచంలో ప్రతి 150 మందిలో ఒక్కరు బానిసలుగా మగ్గుతున్నారని పేర్కొన్నారు. ట్రాఫికింగ్‌కు గురైన మహిళలు హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 181కు ఫోన్ చేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమను తాము రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సమతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, సిబ్బంది పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి నృత్య నీరాజనంలో 'పురం' కళాకారులు


కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డును అందుకుంటున్న నాట్య గురువు చంద్రభాను చతుర్వేది

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన అభిజ్ఞ నృత్యాలయం నృత్య కళాకారులు ఉడిపి శ్రీకృష్ణ దేవస్థానంలో జరిగిన కర్ణాటక అచీవ్‌మెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ శ్రీకృష్ణుడి నృత్య నీరాజనంలో పాల్గొన్నారు. 100 మంది విద్యార్థులతో 14 గంటల సేపు నిరివ్రామంగా శుక్రవారం రాత్రి వరకూ శ్రీకృష్ణుడి నృత్య నీరాజనం సాగింది. ఇందులో భాగంగా అభిజ్ఞా నృత్యాలయం గురువు చంద్రభాను చతుర్వేది ఆధ్వర్యంలో విద్యార్థులు రోహనిక, నీహస్వి, అతిథిలు భరతనాట్యం, కూచిపూడి, మోహిని హట్టం తదితర వాటిలో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆలయ మఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీ, కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డ్ చీఫ్ కోఆర్డినేటర్ అశ్విని, ప్రముఖ నృత్య గురువు చిన్న జీయర్‌స్వామి ఆశ్రమ నాట్యాచార్యులు ఘంటసాల పవన్‌కుమార్, అశ్వర్థనారాయణ స్వామీజీ చేతుల మీదుగా కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డును నాట్య గురువు చంద్రభాను చతుర్వేది అందుకున్నారు. అనంతరం వారిని అభినందించారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్


సోమందేపల్లి: జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


పావగడ మండలం హనుమంతనహళ్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులతో వాల్మీకి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు.

దుద్దేబండలో విగ్రహావిష్కరణ

పెనుకొండ రూరల్: భారతదేశం గర్వించదగిన మహానీయుడు వాల్మీకి మహర్షి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ కొనియాడారు. శనివారం మండలంలోని దుద్దేబండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వాల్మీకి అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరా, సర్పంచ్ గౌతమి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహులు, వైస్ చైర్మన్ సునీల్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వైశాలి జయశంకర్ రెడ్డి, చిత్రా మల్లికార్జున, రాము, వాల్మీకి నటేష్, నరసప్ప, అంజి, భాస్కర్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి/అమరాపురం/పావగడ: వాల్మీకి జయంతి సందర్భంగా సోమందేపల్లి మండలంలోని చెన్నాపురంలో మహిళల జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, ఎంపీటీసీ నాగప్ప పాల్గొన్నారు. అలాగే అమరాపురంలో వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం వాల్మీకి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ స్వగ్రామం హనుమంతనహళ్లిలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మార్కింగ్ మేరకు భవనాలు తొలగించండి


దుకాణదారులు, కౌన్సిలర్లతో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్‌నాయుడు

హిందూపురం: అధికారులు మార్కింగ్ మేరకు దుకాణాలు తొలగించాలని యజమానులు డిమాండ్ చేశారు. హిందూపురం పట్టణ నడిబొడ్డున రైల్వేరోడ్డు విస్తరణ మున్సిపల్ అధికారులు వారం కిందట ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులాభవనాలు తొలగింపు పనులు ముమ్మరం చేశారు. అయితే మున్సిపల్ అధికారులు ఇష్టానుసరంగా భవనాలు కూల్చివేస్తుడంతో భవన యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం దుకాణదారులు వ్యతిరేకించారు. గతంలో కొలతలు తీసుకుని ఇరువైపులా 35 అడుగుల ప్రకారం 70 అడుగుల వరకూ మార్కింగ్ వేశారు. అయితే అధికారులు క్రమపద్ధతి లేకుండా జేసీబీలతో భవనాలు కూల్చివేసి ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. దీంతో జేసీబీతో పనులు జరగకుండా భవన యజమానులు అడ్డుకున్నారు. దీంతో వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు అక్కడి చేరుకుని భవన యాజమానులు, వెంకటస్వామి, కౌన్సిలర్ రోషన్‌అలీ, నాయకులు షఫీ తదితరులతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ఇబ్బంది లేకుండా చూస్తామని వారికి సర్దిచెప్పారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీ మూర్తి మండల కన్వీనర్ రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి అనంతపురం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా ఎంపీ మిథున్‌రెడ్డి నియమాకంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, రీజినల్ కోఆర్డినేటర్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం బంద్

అగళి: ఆలూడి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు బంద్ చేశారు. ఎండీఎం నిర్వాహకులు రాకపోవడంతో 75 మంది విద్యార్థులు భోజనం అందక పస్తులుండాల్సి వచ్చింది. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా ఎండీఎం నిరాహకుడు ఆరోగ్య సమస్యతో భోజనం వండలేదన్నారు. అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టినట్లు నమోదు చేయడం గమనార్హం.

23న మండల సమావేశం

లేపాక్షి: స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షురాలు వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

రొద్దం/మడకశిర రూరల్: రొద్దం మండలంలోని బూచెర్ల గ్రామ పంచాయతీలో శనివారం రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు. భూ సమస్యలపై పలువురు రైతులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అలాగే మడకశిర మండలంలోని కల్లుమర్రి గ్రామ సచివాలయంలో భూరీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్, సర్పంచ్ గంగమ్మ, కార్యదర్శి వరదరాజులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా యూనిస్ బాబు



చిలమత్తూరు: తహసీల్దార్‌గా యూనిస్ బాబు శనివారం భాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పెనుగొండ ఆర్డీఓ గా ఆనంద్ బాబు వెళ్లిన తర్వాత లేపాక్షి తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. అయితే పెద్ద మండలం కావడం, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో చిలమత్తూరు రీ సర్వే డీటీగా పనిచేస్తున్న యూనిస్‌బాబుకు తహసీల్దార్ ఎఫ్ఏసీగా అదనపు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ చేతన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సబ్ జైలు తనిఖీ


ఖైదీల నుంచి వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి ఎం. శ్రీధర్.

హిందూపురం అర్బన్: పట్టణంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. జైలులో ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఖైదీలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు రావడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు విలువైన సమయాన్ని వృథా చేసుకుని కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత సత్ ప్రవర్తనతో మెలగాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఖైదీలు దరకాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సాయం అందిస్తామన్నారు. జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్, న్యాయవాదులు గోపాలకృష్ణ, నవేరా, అంజినమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు అందిస్తున్న స్పెయిన్ మిత్ర బృందం

గుడిబండ: ఎస్ రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో స్పెయిన్ మిత్ర బృందం చేతులమీదుగా 118 మంది విద్యార్థులకు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఏటిఎల్ మీనాక్షి, రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు రామ్‌మూర్తి, ఉపాధ్యాయుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ద్వారా రూ.కోటితో నిర్మించిన గదులను స్పెయిన్ దేశస్తులు శనివారం పరిశీలించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. తర్వాత ఇక్కడి ఆహార అలవాట్లు, ఆచరిస్తున్న విధానాలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీ మల్లికార్జున, ఏటీఎల్ ఓబులేష్, స్పెయిన్ బృందం సభ్యులు, ఆర్డీటీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం: వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్స్ కుశల్ హెల్త్ కేర్ క్లినిక్ సహకారంతో శనివారం మండలంలోని వెంకటాపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ వాహీద్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ వితరణ

రొళ్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు శనివారం పూర్వ విద్యార్థి హెచ్‌ఎంపల్లికి చెందిన లక్ష్మీకాంత్ రూ.25 వేలు విలువైన కంప్యూటర్‌ను అందించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహదేవప్ప లక్ష్మీకాంత్‌ను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభకార్యం

గోరంట్ల: మండల పరిధిలోని గడ్డం తండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వినోద్‌కుమార్ నాయక్, ఉమాబాయి వివాహం శనివారం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ వివాహ వేడుకలకు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

పరామర్శ

గోరంట్లలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పరామర్శించారు. కరావులపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటశివారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గుంటిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబుళరెడ్డి భార్యను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర్, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాం నాయక్, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

పావగడ: తాలూకా లోని కేటీహళ్లిలో ఇళ్లు ఖాళీ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు లోకేశ్ పాళేగార్, కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. శనివారం వారు బాధితులతో కలిసి తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేటి హళ్లి గ్రామంలోని సర్వే నంబరు 96లో గ్రామానికి చెందిన 30 మంది నిరుపేదలు 20 ఏళ్ల క్రితమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఇంటి పట్టాలు, ఇతర సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం ఇప్పుడు చెరువు ఆక్రమణ పేరుతో ఉన్న ఫళంగా ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం శోచనీయమన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ మూర్తి కి వినతి పత్రం అందించారు.

తెరచుకోని సచివాలయం



గుడిబండ: జమ్మలబండ సచివాలయం మూతపడింది. శనివారం సచివాలయం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పని నిమిత్తం సచివాలయానికి వచ్చారు. అయితే సచివాలయం తెరవకపోవడతో నిరాశతో వెనుదిరిగారు. వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవడంతో సచివాలయంలో కార్యకలాపాలు జరగడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.